# తెలుగు సినీ గేయకవుల చరిత్ర

డా॥ పైడిపాల



# తెలుగు సినీగేయకవుల చరిత్ర

-డా॥ పైడిపాల

స్నేహ ప్రచురణలు

**16, కామ్‌దార్ నగర్, చెన్నై- 600 034**

# తెలుగు సినీగేయకవుల చరిత్ర

-డా॥ పైడిపాల

ప్రథమ ముద్రణ : డిశంబర్ 2010

ముఖ చిత్రం : బాపు

ప్రతులకు : 1. డా॥ పి.యస్.రెడ్డి
11-13, కొంకాపల్లి
కాలేజ్‌రోడ్, అమలాపురం - 533 201
ఫోన్ : 08856 - 232668

2. అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు

వెల : 225 రూ.
విదేశాలలో - 15 డాలర్లు.

డి.టి.పి. : ఆర్.కె.ఆఫ్‌సెట్ ప్రింటర్స్
అమలాపురం, ఫోన్ : 231419

ముద్రణ : శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ-2
ఫోన్ : 9490634849

హెచ్చరిక : ఈ పుస్తకంలోని ఏ భాగాన్ని ఎవరు ఎలా వినియోగించ దలచుకొన్నా రచయిత అనుమతి అవసరం!

ఇందులో

# అష్ట'పదులు'


1. పాతపాట - కొత్తరాగం (11-19)

2. కనిపించని కవి - వినిపించిన పాట (20-41)

పరిచయాలు :-
చందాల, బలిజేపల్లి, స్థానం నరసింహారావు,
చిలకమర్తి, దైతా గోపాలం,దువ్వూరి రామిరెడ్డి,
మల్లాది విశ్వనాథ కవిరాజు, బసవరాజు అప్పారావు (38-41)

3. హోరెత్తిన జలధి - నోరెత్తని నది (42-78)

1. సినీగేయ సముద్రుడు - సముద్రాల (57-72)
2. పానగల్ పార్కులో మహాబోధి - మల్లాది (72-76)

పరిచయాలు :-
తాపీ ధర్మారావు, బాలాంత్రపు రజనీకాంతరావు (76-78)

4. స్వర్ణపర్ణం - షడ్రసాన్నం (79-196)

1. విజయగీతాల పింగళి (80-92)
2. సినీ జానపదాలకు మహరాజు - కొసరాజు (92-107)
3. తేనెపాటల జాబిల్లి - దేవులపల్లి (107-121)
4. మహారాజశ్రీ శ్రీశ్రీ (121-139)
5. అద్భుత ప్రతిభాశాలి ఆరుద్ర (140-158)
6. మన'సు' కవి ఆత్రేయ (159-184)

మర్చిపోరాని మరికొందరు :-
సదాశివ బ్రహ్మం, తోలేటి, సముద్రాల (జూ),
అనిసెట్టి, రాజశ్రీ, రావూరు,
పాలగుమ్మి పద్మరాజు, సుంకర-వాసిరెడ్డి,
కె.జి. శర్మ, జి.కె. మూర్తి, చెఱువు ఆంజనేయ శాస్త్రి,
జంపన, వడ్డాది, మహారథి. (184-196)

**5. శరధిద్వయం – 'పగలే వెన్నెల' హయాం** **(197–238)**

1. సినీ హనీగీతాల సి.నా.రె. (198-216)

2. కవితాశరధి - దాశరథి (217-226)

మర్చిపోరాని మరికొందరు :-
వీటూరి, మల్లెమాల, గోపి, నార్లచిరంజీవి,
ముళ్లపూడి వెంకటరమణ,
భుజంగరాయశర్మ, అప్పలాచార్య. (226-238)

**6. ఝుమ్మంది రాగం – 'సై' అంది వేగం** **(239–273)**

వెల్లువెత్తిన పాటలగోదారి వేటూరి (240-259)

మర్చిపోరాని మరికొందరు :-
దాసరి నారాయణరావు, జాలాది,
దాసం గోపాలకృష్ణ, ఉషఃశ్రీ, మోదుకూరి జాన్సన్,
గణేశ్‌పాత్రో, నాగభైరవ, శేషేంద్ర శర్మ,
గోన విజయరత్నం, వడ్డేపల్లి కృష్ణ (259-273)

**7. అయోమయం – ఒక నవోదయం** **(274–308)**

శిశిరంలో కోయిల సిరివెన్నెల (275-290)

మర్చిపోరాని మరికొందరు :-
వెన్నెలకంటి, భువన చంద్ర, జొన్నవిత్తుల, సాహితి,
అదృష్టదీపక్, రసరాజు, గురుచరణ్, శ్రీకాంత్ శర్మ, గద్దర్,
సాయిశ్రీహర్ష, ఇ.యస్. మూర్తి, శ్రీవేదవ్యాస. (290-308)

**8. పరుగుబాటలో పాట – మాటపడుతున్న మాట** **(309–352)**

**1. గుర్తుండే కొందరు సినీగేయ కవులు (1990–99)**
అశోక్ తేజ, చంద్రబోస్, సామవేదం షణ్ముఖ శర్మ,
వెనిగళ్ల రాంబాబు, గోరటి వెంకన్న,
ఎ.ఎం.రత్నం-శివగణేశ్. (317-337)

**2. గుర్తుండే కొందరు సినీగేయ కవులు (2000–2009)**
కులశేఖర్, అందెశ్రీ, భాస్కరభట్ల,
రామజోగయ్యశాస్త్రి,
అనంత శ్రీరామ్, వనమాలి (337-352)

# పాతపాట-కొత్తరాగం

వానలో తడవని వాళ్లు, ఒకటి రెండు పంక్తుల సినిమాపాటైనా నోటికి రాని తెలుగువాళ్లు – నేడు వుండరనడం అతిశయోక్తి కాదు.. అక్షర సత్యం ! ఆధునిక జనజీవితంలో భాగమైన సినిమాపాట సర్వవ్యాపి. వర్గవయోభేదాల కతీతంగా పసివాళ్లనుంచి పండు ముదుసళ్ల వరకు, కూలి–నాలిజనం నుంచి కోట్లకు పడగలెత్తిన వాళ్ల వరకు, సామాన్యుల నుంచి ధీమాన్యుల వరకు – అందరి ఆదరణకు పాత్రమౌతున్న ఏకైక ప్రక్రియ సినిమాపాట మాత్రమే. టి.వి. ఛానల్స్ ఇంటింటా అందుబాటులో వుండి సినిమాహాళ్లకు రద్దీ తగ్గిన ఈ కాలంలో కూడా సినిమాపాట మాత్రం సర్వకాల సర్వావస్థల్లోనూ మనిషికి తోడుగా వుంటోంది. సి.డి.లు, సెల్‌ఫోన్లు, ఐపాడ్స్... మొదలైన ఆధునిక పరికరాల పుణ్యమా అని ప్రయాణాల్లో కాలం భారం కాకుండా మనిషిని కాపాడుతున్న శ్రవ్యవినోదం చలనచిత్ర గీతమే ! ఈనాడు కొన్ని రేడియో, టీవీ మ్యూజిక్ ఛానల్స్ అహోరాత్రాలు అవిశ్రాంతంగా సినిమాపాటల్ని ప్రసారం చెయ్యడం – వాటిపట్ల జనానికున్న మక్కువకు నిదర్శనం.

ఇంతగా మన బ్రతుకులతో ముడిపడిపోయిన సినిమాపాట ప్రభావం కూడా అంతాయింతా కాదు. నేడు రాజకీయం కంటె సినిమాపాట మీద చర్చ వాడిగా వేడిగా సాగుతోంది. సినిమాపాట చేస్తున్న మేలుకీళ్ల గురించి ఒక వంక, దాని ప్రమాణాల గురించి మరొక వంక వాదోపవాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల వస్తున్న సినిమాపాటల్లో అధికశాతం చెత్త అనీ, వాటిలో శబ్దఘోష తప్ప అర్థం, అన్వయం వుండడం లేదనీ సాహితీప్రియులు పెదవులు విరుస్తున్నారు. మరికొందరు దేశకాల పరిస్థితులతోపాటు సినిమాపాటల్లో కూడా మార్పు సహజమనీ, ఇది పతనం కాదనీ వాదిస్తున్నారు. నేటి పాట గురించి అధికసంఖ్యాకులు– ఒకనాడు స్వర్ణయుగాన్ని అనుభవించిన తెలుగు సినిమాపాటకిది క్షీణయుగమని వాపోతుంటే – మరోపక్క కొందరు తెలుగు సినిమాపాట సాహిత్య పరంగా పదునెక్కుతోంది అని వ్యాఖ్యానిస్తున్నారు.

సినిమాపాట పరిణామం గురించి ముందుగా తెలుగు సినిమాపాటకు జాతీయ బహుమతులను అందుకొన్న ముగ్గురు కవుల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

'అల్లూరి సీతారామరాజు' (1974) చిత్రంలోని 'తెలుగు వీర లేవరా దీక్షబూని సాగరా' అనే పాటకు జాతీయపురస్కారాన్ని అందుకొని తెలుగు సినిమాపాటకు మొట్టమొదటసారి ఆ గౌరవాన్ని దక్కించిన సినీగేయకవి మహాకవి శ్రీశ్రీ. ఆయన –

'సినిమాకు పాటలు రాయడం చాలమంది అజ్ఞానులనుకొనేటంత సులభం కాదు' అని ఒక సార్వకాలికమైన సార్వజనీనమైన వ్యాఖ్యను చేశారు. ఇది వర్తమాన సినీ కవులకు హెచ్చరిక లాంటిది.

'మాతృదేవోభవ' (1993) చిత్రంలో 'రాలిపోయే పూవా, నీకు రాగాలెందుకే, తోటమాలి నీ తోడులేడులే' అనే పాటకు జాతీయపురస్కారాన్ని అందుకొని సుమారు రెండు దశాబ్దాల విరామం తర్వాత మళ్లీ తెలుగు సినిమాపాటను జాతీయస్థాయిలో గుర్తు చేసిన సినీకవి వేటూరి సుందరరామమూర్తి. ఆయన పాత సినిమాపాటకు కొత్త సినిమాపాటకు మధ్యవున్న భేదం గురించి ఇలా అన్నారు –

'పాత సినిమాపాటలు అరిటాకులో వడ్డించిన షడ్రసోపేతమైన భోజనం లాంటివైతే, ఇప్పటి పాటలు ఫాస్ట్ ఫుడ్స్ లాంటివి'.

ముచ్చటగా మూడవసారి తెలుగు సినిమాపాటకు జాతీయపురస్కార గౌరవాన్ని లభింపజేసిన వర్ధిష్ణుకవి సుద్దాల అశోక్‌తేజ. 'ఠాగూర్' (2003) చిత్రంలో – 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అనే వీరరస ప్రధానమైన గేయానికి ఈ బహుమతినందుకొన్న అశోక్‌తేజ –

'నాటి పాట అనే వధువును సంగీతం పల్లకిలో మోసుకెళ్లేది. పాట కనిపించేది. నేటి పాట అనే వధువును సంగీతం జెట్ స్పీడ్‌లో లాక్కొని వెళుతోంది'

అంటూ పాశ్చాత్య సంగీతపుహోరులో కొట్టుకొనిపోతున్న కొత్తపాట పట్ల తన అసంతృప్తిని తెలియజేశారు.

ఎంతో ప్రాధాన్యం కలిగి, ఇంత వివాదాస్పదమైన తెలుగు సినిమాపాట పుట్టుపూర్వోత్తరాలను ముందుగా టూకీగా తెలుసుకొందాం. ఈ వివరాలు చర్విత చర్వణమే అయినా మొదటి పాట గురించి వున్న అనేకమైన అపార్థాల, అపోహల నేపథ్యంలో నిగ్గుతేల్చిన నిజాలను చరిత్రకందివ్వడం అవసరం.

**తొలి సినిమాపాటలు :–**

ప్రపంచంలో మొట్టమొదటి టాకీ అయిన 'జాజ్‌సింగర్' (6–10–1927) చిత్రంలో 'పాల్ డ్రెస్సర్' రచించి స్వరల్పన చేయగా 'జాల్సన్' పాడిన 'డర్టీహేండ్స్ డర్టీ ఫేస్' అనేది ప్రపంచంలో మొదటి సినిమాపాట. ఇది వినిపించిన మూడున్నర యేళ్లకు అంటే 14.3.31న బొంబాయిలో విడుదలయిన 'ఆలంఆరా' హిందీ చిత్రంలో డబ్ల్యు.యమ్.ఖాన్ పాడిన –

**'దేదే ఖుదా కె నామ్ సే ప్యారే'**

అనేది ప్రప్రథమ భారతీయ చలనచిత్ర గీతం. భారత చలనచిత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగిన 1931లోనే మొట్టమొదటి తెలుగు సినిమాపాట కూడా వినిపించింది. ఆ పాట ఇంపీరియల్ మూవీటోన్, బొంబాయి వారు హెచ్.యం. రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'భక్త ప్రహ్లాద' చిత్రంలోనిదనే వరకు ఎటువంటి సంశయాలు లేవు. ఎటొచ్చీ మొదటిపాట గురించి, దాని కర్తృత్వం గురించి పరిశోధకులూ, విమర్శకులూ రాద్ధాంతాలు చేసి పాఠకులను అయోమయావస్థకు గురిచేశారు.

**'ప్రహ్లాద' పూర్వాపరాలు :**

నాటక పితామహ ధర్మవరం కృష్ణమాచార్యకృతమైన ప్రహ్లాదనాటకాన్ని 'భక్తప్రహ్లాద' చలనచిత్రంగా వెండి తెరకెక్కించినట్టు ఆ సినిమాలో నటించిన సింధే కృష్ణాజీరావు, ఎల్.వి. ప్రసాద్, సురభి కమలాబాయి మొదలైన సురభి నాటకసమాజ సభ్యులు ఈ వ్యాసకర్తకు ప్రత్యక్షంగా చెప్పారు[1]. పత్రికలకిచ్చిన ఇంటర్వ్యూలలో తెలియజేశారు.

సినిమాలోని తారాగణం, సాంకేతిక నిపుణులు చాల వరకు ఆ నాటకాన్ని ప్రదర్శించిన సురభి నాట్యమండలి సభ్యులే అయినప్పటికీ భక్త ప్రహ్లాద చిత్రం ధర్మవరం కృష్ణమాచార్య నాటకానికి మక్కీకి మక్కీ కాదని అదనంగా చేరిన పాటల వల్ల తెలిసింది. ఈ అదనపు పాటల్ని రాసిన కవి చందాల కేశవదాసు అనీ, ఆయననే తొలి తెలుగు సినీకవిగా పరిగణించడం సమంజసమనీ నా 'తెలుగు సినిమాపాట చరిత్ర'లో రాశాను[2]. ఈ సందర్భంగా వచ్చిన అపోహల్ని తొలగించడానికి కొన్ని విషయాల్ని తిరగతోడాలి.

తెలుగు నాటకాల్లో పద్యాలతో పాటు పాటల్ని కూడా ప్రవేశపెట్టిన మొదటి నాటక రచయిత ధర్మవరం రామ కృష్ణమాచార్య. ఆ సంప్రదాయం ఆయన రచించి ప్రదర్శించిన 'చిత్రనళీయం'తో ప్రారంభమైంది. ముందుగా వచన నాటకాన్ని రచించి ఆ తర్వాత పద్యాలనూ పాటలనూ అనుబంధంగా కూర్చడం ధర్మవరం వారి అలవాటు. అలాగే ఆయన తన ప్రహ్లాద నాటకానికి కూడా 40 పాటల్ని రచించి పద్యాలను మాత్రం పోతన భాగవతం నుంచి తీసుకొన్నారు.[3] ధర్మవరం రామకృష్ణమాచార్య 29 నాటకాల్ని రాశారు. వాటిలో ముద్రితాలు 14. ప్రహ్లాద నాటకం ముద్రితాల జాబితాలో వున్నా, అది ఆయన జీవించివుండగా అచ్చు కాలేదు. 'చిత్రనళీయం', 'విషాద సారంగధరము' మాత్రమే ఆచార్యుల వారు బ్రతికి వుండగా అచ్చయిన నాటకాలు. రామకృష్ణమాచార్య రచించిన నాటకాలను ఆయన దర్శకత్వంలో సరసవినోదినీ సభ, బళ్లారి వారు ప్రదర్శించేవారు. అయితే 1912లో కొందరు సరసవినోదినీ సభ సభ్యులు ఆచార్యుల వారితో విభేదించడం వల్ల 1912 ఆగష్టు నెలలో ఆయన 'అభినవ సరసవినోదిని' అనే పేరుతో వేరే సమాజాన్ని స్థాపించి 7-9-1912న ఆ సమాజం పక్షాన ప్రహ్లాద నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఆ సంవత్సరమే నవంబరు 30వ తేదీన రామకృష్ణమాచార్య మరణించారు[4]. ఈ సమాచారాన్ని బట్టి రామకృష్ణమాచార్య దర్శకత్వంలో ప్రదర్శించబడిన ఆయన చివరి నాటకం 'ప్రహ్లాద'

---

1. ఎల్.వి. ప్రసాద్‌తో ముఖాముఖీ 29.7.89
   సింధే కృష్ణాజీ రావుతో ముఖాముఖీ 10.9.89
2. తె.సి.పా. చరిత్ర పుట - 27
3. ధర్మవరం రామకృష్ణమాచార్య పుట - 63
   (డా. పోణంగి శ్రీరామ అప్పారావు)
4. ధర్మవరం రామకృష్ణమాచార్య - 28వ పుట.

అని, ఆయన మరణానంతరం ఆ నాటకం సురభి నాటక సమాజం వారి చేతుల్లో పడిందనీ అర్థమవుతోంది.

**చందాల పాటలు - రాద్ధాంతాలు :**

శాఖాచంక్రమణ మయినా 'ప్రహ్లాద' నాటకం గురించి ఇంత తర్జన భర్జన 'భక్త ప్రహ్లాద' చిత్రంలో వున్న చందాల కేశవదాసు పాటలు నేరుగా సినిమాకి రాసినవా ? లేక నాటకం ద్వారా సినిమా కెక్కినవా? అనే సందేహాన్ని 'శ్రీ చందాల కేశవదాసు సాహిత్యము- పరిశీలనం' అనే సిద్ధాంత వ్యాసాన్ని రాసిన ఎం. పురుషోత్తమాచార్యులు లేవనెత్తడం వల్ల అవసరమైంది. చందాల కేశవదాసు ప్రహ్లాద కోసం రాసిన 3 పాటలు-

1. **పరితాప భారంబు భరియింప తరమా**
   **కటకట నేవిధి గడువంగ జాలుదు**

2. **తనయా ఇటులన్ తగదుర బలుకా**
   **తండ్రి మాట వినకా**

3. **భీకరమగు నా ప్రతాపంబునకు భీతి లేక ఇటు చేసెదవా ?**

ఈ నాటికీ సురభి నాట్యమండలి వారు ప్రదర్శిస్తున్న ప్రహ్లాద నాటకంలో వున్నట్టు ఆ సమాజ నిర్వాహకులు ఎస్.ఏ. బాబారావు ఈ వ్యాస రచయితకు తెలియజేయడం వల్ల, అవి 1930 ప్రాంతంలో అచ్చయిన నూతన గ్రామ్ ఫోను కీర్తనలనే పుస్తకంలో లభించడం వల్ల అవి నాటక ప్రదర్శన ద్వారానే సినిమా కెక్కినట్లు రుజువవుతోంది. అంటే సురభినాట్యమండలి వారు ధర్మవరం వారి నాటకప్రతిని తమ ప్రదర్శన కనుగుణంగా మార్చుకొన్నారనీ, ఆ సందర్భంగా ముత్తరాజు సుబ్బారావు 'శ్రీ కృష్ణ తులాభారం' నాటకానికి 'బలేమంచి చౌక బేరము' మొదలైన పాటల్ని రాసిన చందాల కేశవదాసు చేత ఈనాటకానికి కూడా పాటలు రాయించుకొన్నారనీ... ఆ పాటలు నాటక ప్రదర్శన ఆధారంగా నిర్మించిన 'భక్తప్రహ్లాద' చిత్రంలో చోటు చేసుకొన్నాయనీ భావించడం సమంజసం.

ఈ అభిప్రాయానికి భిన్నంగా పురుషోత్తమాచార్యులు 19 ప్రహ్లాద నాటకాల్లో ఏ నాటకానికి కేశవదాసు పాటలు రాశారో రుజువులు లేవనీ అందువల్ల హెచ్.యం.రెడ్డి కేశవదాసును పిలిపించి 'భక్త ప్రహ్లాద' చిత్రానికి ఆ 3 పాటలనూ రాయించి వుంటారని వూహించారు[5]. కేశవదాసు సినిమా కోసం రాసినా, అంతకు ముందే నాటకం కోసం రాసినా- ఆయన జీవించి వుండగా ఆయన అనుమతితో ఆ పాటల్ని దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి 'భక్త ప్రహ్లాద' సినిమాలో వుపయోగించడం వల్ల చందాల కేశవదాసును తొలి తెలుగు సినీకవిగా పేర్కొనడం సమంజసమని[6] నేను 'తెలుగు సినిమాపాట చరిత్ర'లో

---

5. శ్రీ చందాల కేశవదాసు సాహిత్యము - పరిశీలనం - 137వ పుట.
6. తెలుగు సినిమాపాట చరిత్ర - పుట 27.

ప్రతిపాదించాను. పాటల రచనాకాలం గురించి ఒకరిద్దరి వూహలు వేరుగా వున్నా, ఈ ప్రతిపాదనను మాత్రం అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు.

**తొలి తెలుగు సినిమాపాట – అలవాటుగా పొరపాటు :**

తొలి తెలుగు సినిమాపాటను గుర్తించడంలోనే చాలమంది సినీగేయ పరిశోధకులు, విమర్శకులు పొరబడ్డారు. నిజానికి తొలితెలుగు సినిమాపాట అరకొరగా వినిపించింది– 'భక్త ప్రహ్లాద'కు కనీసం నెల ముందు హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలోనే వచ్చిన 'కాళిదాసు' తమిళ చిత్రంలో! 'కాళిదాసు'లో నాయకుడు శ్రీనివాసరావు మద్రాసులో తెలుగు హరికథలు చెప్పే భాగవతారు, నాయిక తమిళనటి టి.పి. రాజ్యలక్ష్మి కావడం వల్ల అందులో నాయకుడు పాడిన తెలుగు పాటలు చోటు చేసుకోవడంతో అది పూర్తిగా తమిళ చిత్రం కాదు; ద్విభాషా చిత్రమని కొందరు అభిప్రాయపడ్డారు. ఏది ఏమయినా పూర్తిగా తెలుగు మాటలు పాటలతో విడుదలయిన మొదటి చిత్రం 'భక్త ప్రహ్లాద'యే గనుక – అందులో వినిపించే మొట్టమొదటి పాటనే తొలితెలుగు సినిమాపాటగా అంగీకరించడం సముచితం. అలా వినిపించిన మొదటి పాట ధర్మవరం రామకృష్ణమాచార్య కృతమైన–

**'వింతాయెన్, వినన్ సంతసమాయెనుగా..'** అనేది !

హిరణ్య కశిపునికి తపోభంగం చెయ్యడానికి వెళ్లిన రంభాది అప్సరసలు అతడు తపస్సు చేస్తున్నవాడు చేస్తున్నట్టే మరణించాడని భ్రమించి ఆ సంతోషకరమైన వార్తను దేవేంద్రునికి చేరవేస్తారు. ఆ ఆనందంలో రంభ గానం చేసిన పాట యిది. అప్పుడు నాటకక్రమం లోనే సినిమా తీయడం వల్ల నాటక ప్రథమాంకంలో వున్న ఈ పాట సహజంగా సినిమాలో మొదటి పాట అవుతుంది. అయితే 'భక్త ప్రహ్లాద' చిత్రంలో లీలావతి పాత్ర ధరించిన సురభి కమలాబాయి ఆ సినిమాలో తను పాడిన మొదటి పాట 'పరితాపభారంబు భరియింపతరమా?' అంటూ తను మొదట కెమెరా ముందు నిల్చుని పాడిన పాట గురించి పత్రికల కిచ్చిన ఇంటర్వ్యూలలో జ్ఞాపకం చేసుకొని చెప్పడం వల్ల – అది తొలి తెలుగు సినీకవిగా గుర్తించిన చందాల కేశవదాసు రచన కావడం వల్ల – ఆ పాటను తొలి తెలుగు సినిమాపాట అని ఎక్కువ మంది భ్రమించారు. వాస్తవానికి 'ప్రహ్లాద' నాటక రచయిత ధర్మవరం రామకృష్ణమాచార్య అయినా, ఆ నాటకంలో పోతన పద్యాలున్నా – 1931లో ఆ సినిమా తీసే నాటికి సజీవులైన రచయిత అదనపు పాటలు సమకూర్చిన చందాల కేశవదాసు ఒక్కరే గనుక – ఆయనను తొలి తెలుగు సినీకవిగా గుర్తించడం జరిగింది – అంతే గాని ఆ సినిమాలో వినిపించిన తొలిపాట ఆయనది కాదు. ఏతావాతా నిస్సందేహంగా తొలితెలుగు సినిమాపాట ధర్మవరం వారు రచించిన గీతమే! అది –

1. **'వింతాయెన్ వినన్ సంతసమాయెనుగా**
**దేవేంద్ర, సంతసమాయెనుగా సురనాథ**
**అడగెను దేవారి బెడిదపు దపమున**

గూరివడి ప్రాణంబెడబాసి
మనసున నానందంబును మిగులుగా
నీవొంద దనుజుండు మృతిజెందె'          అనేదే !

**పరుగుబాట – కొత్త పాట :**

ప్రస్తుతం తెలుగు సినిమాపాట వయస్సు 80 యేళ్లు. ఈ ఎనిమిది దశాబ్దాలలో దాని స్వరూప స్వభావాలలో గణనీయమైన మార్పు వచ్చింది. భాష, భావం, బాణీ, అభివ్యక్తి మొదలైన అంశాలలో వివిధ దశలలో క్రమక్రమంగా మారుతూ వచ్చిన తెలుగు సినిమాపాట నేడెలా వుందో అర్థం కావడానికి ఒక ఉదాహరణను చూద్దాం.

**కమాన్ ఎవ్రీబడీ, ఇట్స్ టైమ్ టు రోల్**
**లెట్ అజ్ వెల్‌కమ్ ద ఇండియన్ గరల్**
**అలేగ్రా అలేగ్రా అలేగ్రా అలె అలె ఏగ్రా**          ॥అలేగ్రా॥

**చరణం: 1** **ఇండియా పిల్లే ఇంగో ఇటాలీ కళ్లే స్వింగో**
**నేను ఓ మెరుపుల మాంగో పరువంలో ఫ్లెమింగో**
**మేనులో మాగ్నెట్ పొంగో మాటలో చాక్‌లెట్ భంగో**
**నేనొక కరెంటు రింగో తాకితే తల తిరిగింగో**
**రెడ్ వైన్ బాటిల్ నే కాశ్మీర్ ఆపిల్ నే గోల్డెన్ ఏంజెల్ నేనే**   ॥అలేగ్రా॥

**చరణం: 2** **ఆడదాం టాంగో టాంగో అదరనీ కాంగో భంగో**
**జీవితం షార్టో లాంగో తిప్పేద్దాం స్టీరింగో**
**అలేగ్రా అలేగ్రా అలేగ్రా అలె అలె ఏగ్రా**
**పాడదాం సాంగో సాంగో తోడుగా సింగో సింగో**
**అడుగులే రైటో రాంగో నడిచేస్తే థ్రిల్లింగో**
**అలేగ్రా అలేగ్రా అలేగ్రా అలె అలె ఏగ్రా**
**స్పేసే దాటేసే స్పైసీ డాన్సేస్తే స్కైసే స్టెప్సేయవా**          ॥అలేగ్రా॥

చిత్రం : మల్లన్న (2009)
రచన : సాహితి, సంగీతం : దేవిశ్రీ ప్రసాద్

**ఎనిమిది దశాబ్దాలు – ఎన్నో కలాలు :**

కాలానుగుణంగా సినిమాపాటలో వచ్చిన పరిణామాల్ని విశ్లేషిస్తూ నేను 'తెలుగు సినిమాపాట – ప్రభావాలు, పరిణామాలు' అనే సిద్ధాంత గ్రంథాన్ని రాసి మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి.ని పొందాను (1992). నా కంటె ముందు ముగ్గురు నలుగురు పరిశోధకులు తెలుగు సినిమాపాటల్లో సాహిత్యపు విలువలు గురించి పరిశోధనలు చేసి వివిధ విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీలను పొందారు. ఇలా సుమారు మూడు దశాబ్దాల క్రితం సినిమాపాట మీద విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమైన పరిశోధన నేడు విస్తృత

స్థాయినందుకొంది. సినిమాపాటల్లో భక్తి గీతాలు, దేశభక్తి గీతాలు, లాలి పాటలు మొదలైన అంశాలను తీసుకొని కొందరు, చందాల కేశవదాసు మొదలకొని చంద్రబోస్ వరకు వచ్చిన తెలుగు సినిమాకవులలో ఒక్కొక్కరిని ఎంచుకొని వారి సినీగేయసాహిత్యం మీద ఎక్కువ మంది పరిశోధనలు చేసి సిద్ధాంత వ్యాసాలను వెలువరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1993 నుండి సినిమాసాహిత్యం మీద వస్తున్న వ్యాసాలకూ, పుస్తకాలకూ కూడా నంది బహుమతులనిచ్చి ప్రోత్సహించడంతో విద్యాసంస్థలతో పాటు బయట కూడా సినిమా సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. ఇలా సినిమాసాహిత్యం మీద ముఖ్యంగా సినిమాపాటల మీద పుంఖాను పుంఖాలుగా రచనలు వెలువడుతున్న ఈ తరుణంలో సినిమాపాట వికాసాన్ని కొత్త కోణంలో విశ్లేషించాలనే ఆలోచన ఈ రచనకు ప్రేరణ.

1992లో 'తెలుగు సినిమాపాట' గాను, ఆ తర్వాత మార్పులు చేర్పులతో 2005లో 'తెలుగు సినిమాపాట చరిత్ర' గాను ముద్రిత రూపంలో పాఠకులు ఆదరణ పొందిన నా పుస్తకాలకు మూలం నేను మద్రాసు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన సిద్ధాంత వ్యాసమే! దానిలో తెలుగు సినిమాపాట చరిత్రను కాలానుగుణంగా వచ్చిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని అరుణోదయం (1931–37), భావోదయం (1938–50) రాగోదయం (1951–60) రసోదయం (1961–70), చంద్రోదయం (1971–78), అయోమయం (1979–91) అని ఆరు దశలుగా విభజించి, 'తెలుగు సినిమాపాట చరిత్ర'లో తర్వాతి దశను 'తమోమయం'గా పేర్కొన్నాను. అలా పేర్కొనడానికి తగిన కారణాల్ని కూడా వివరించాను. ఆ విభజన అధికసంఖ్యాకులకు అమోదయోగ్యం కావడంతో అర్వాచీన పరిశోధకులు దానిని ప్రామాణికంగా గ్రహించి తమ సిద్ధాంత వ్యాసాలలో అనుసరించారు. ఏడు దశలలో తెలుగు సినిమాపాటను నాటక సాహిత్యం, వాగ్గేయ కార సాహిత్యం, సంప్రదాయ సాహిత్యం, జానపద సాహిత్యం, భావ కవిత్వం, జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, అభ్యుదయ విప్లవ కవిత్వోద్యమాలు, అన్యభాషలు, పాశ్చాత్య సంగీతం మొదలైనవి ఎలా ఎలా ప్రభావితం చేసి ప్రస్తుత రూపం రావడానికి దోహదం చేశాయో వివరించే ప్రయత్నం 'తెలుగు సినిమాపాట చరిత్ర' రచన. ఈ ప్రభావాలతో పాటు నాటక పరివర్తన దశ మొదలుకొని నేటి వరకు వచ్చిన సుమారు 400 మంది సినీగేయకవులలో మార్గనిర్దేశకులనదగిన వారి ముద్రలు తెలుగు సినిమా పాట వికాసం మీద స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ మార్గనిర్దేశకులు ప్రత్యేకమైన వారి శైలులతో తెలుగు సినిమాపాటను ఎలా మలిచారో సమీక్షించడమే ఈ పుస్తక ప్రణాళిక.

తెలుగు సాహిత్య చరిత్రను ప్రాఙ్నన్నయ యుగం మొదలుకొని ఆధునిక యుగం వరకు కొన్ని యుగాలుగా విభజించినట్టే – తెలుగు సినిమాపాట రూపురేఖల్ని మార్చిన నవ్యమార్గ నిర్దేశకులైన సినీగేయ కవులను కొందరిని గుర్తించి, వారి పరంగా సినీ గేయ సాహిత్య చరిత్రను వివిధ యుగాలుగా విభజించి రాయడం ఈ రచన ధ్యేయం. అయితే, వెయ్యేళ్ల విస్తృతి గల తెలుగు సాహిత్య చరిత్రకున్న వెసులుబాటు యుగ విభజన విషయంలో

కేవలం 80 యేళ్ల పరిమిత పరిధి గల తెలుగు సినీగేయ చరిత్రకు లేదు. ఈ చరిత్రలో కొందరు ఉద్దండులైన కవులు రెండు మూడు దశాబ్దాల పాటు నిలిచి తమ రచనావ్యాసంగాన్ని కొనసాగించడం వల్ల, ఒకే కాలంలో ప్రతిభావంతులైన అనేక కవులు తమతమ మార్గాలలో సినీగేయ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడం వల్ల సాహిత్యచరిత్ర ధోరణిలో వారిని యుగకర్తలుగా పేర్కొనే అవకాశం లేదు. అయినా, వారి ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ తెలుగు సినీగేయ చరిత్రలో వారి స్థానాన్ని అంచనా వేయడం జరిగింది.

**పాటపై పరిశోధన – తులనాత్మక పరిశీలన :**

సాధారణంగా తులనాత్మక అధ్యయనానికి భిన్న భాషలకు సంబంధించిన సాదృశ్యం గల ఇద్దరు కవులను గాని (ఉదాహరణకు కాళిదాసు, షేక్స్పియర్), భిన్న కాలాలకు సంబంధించిన ఒకే భాషకు చెందిన కవులను కావ్యాలను కాని (ఉదాహరణకు బద్దెన సుమతీ శతకం – వేమన శతకం) సమకాలికులైన కవుల రచనలను కాని (ఉదాహరణకు మను చరిత్ర, వసు చరిత్ర) – ఇలా వివిధ దృక్కోణాలలో పరిశీలనాంశాలను స్వీకరిస్తారు. సినీ గేయకవులకు సంబంధించిన ఈ అధ్యయనంలో కూడా అంతర్లీనంగా ఈ తులనాత్మక పరిశీలన వుంది. నన్నయ కాలంలో పావులూరి మల్లన, మల్లియ రేచన, అధర్వణాచార్యులు మొదలైన కవులు, తిక్కన కాలంలో మూలఘటిక కేతన, మారన, మంచన మొదలైన కవులు.. ఇలా ఒక్కొక్క కాలంలో మేధావులైన కవులెందరున్నా నన్నయ యుగం, తిక్కన యుగం, ఎఱ్ఱన యుగం, శ్రీనాథ యుగం.. అంటూ ప్రధాన కవుల పేర్లతో ఆ యుగాలను వ్యవహరించడం పరిపాటి. అలాగే ఈ సినీ గేయ చరిత్రలో ఎనభయ్యేళ్ల కాలాన్ని ఎనిమిది దశకాలుగా విభజించి ఆయా దశకాలలో కొందరికి అగ్రాసనాలు వేసి, వారితో పాటు కాలానికి నిలిచే పాటల్ని రాసిన మరికొందరి సమకాలికుల గురించి కూడా రాయడం జరిగింది. సమకాలికులు ప్రధాన కవులతో సమంగా తూగకపోవడానికి సాహిత్య చరిత్రలాగే ఇక్కడ కూడా అనేక కారణాలుండొచ్చు. అంతే కాని ఈ చరిత్ర రచనలో ఎవరినీ తక్కువ చెయ్యడం ఈ వ్యాస రచయిత అభిమతం కాదు.

ఇటీవల 'సాక్షి' దిన పత్రిక వారు ఆదివారం అనుబంధం గా వెలువరిస్తున్న 'ఫన్‌డే' రెండవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికలో తప్పక చూడాల్సిన నూరు తెలుగు సినిమాల, తప్పక చదవాల్సిన నూరు తెలుగు పుస్తకాల, తప్పక వినాల్సిన నూరు తెలుగు సినిమాపాటల జాబితాలను సంక్షిప్త వ్యాఖ్యలతో ప్రచురించారు. అనువాద చిత్రగీతాలను మినహాయించగా ఇంత వరకు తెలుగులో వచ్చిన సుమారు 34 వేల సినిమా పాటల నుంచి ఎంపిక చేసిన నూరు పాటల జాబితాలో 27 మంది సినీ కవులు రాసిన పాటలకు మాత్రమే స్థానం లభించింది. ఆ జాబితా ప్రామాణికం అయినా, కాకపోయినా ఎవరు ఎంపిక చేసినా మహా అయితే మరో ఏడెనిమిదిమంది కవుల కంటె దానిలో చోటు చేసుకోరు. అది తెలుగు సినీగేయకవుల సంఖ్యతో పోలిస్తే పదిశాతం కంటె తక్కువ. 'గొప్ప పాటలకన్నిటికీ ఈ జాబితాలో చోటు దక్కకపోయి వుండొచ్చు, కాని ఇందులో వున్నవన్నీ గొప్ప పాటలే'

అని ఆ సంపాదకీయంలో పేర్కొన్నట్టు ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కాలంలో సుమారు 400 మంది సినీగేయ కవులు రాసిన నేరుగా తీసిన తెలుగు సినిమాలలోని 34 వేల పాటల నుంచి కొందరు కవులనూ కొన్ని పాటలనూ ఎంపిక చేసికొని రాస్తున్న ఈ సినీగేయకవుల చరిత్ర సమగ్రమూ, సర్వప్రామాణికమూ కాకపోవచ్చు. అయినా చారిత్రక సత్యాలను గ్రంథస్థం చెయ్యాలనే తపన తప్ప, కత్తిమీద సాము లాంటి ఈ రచనలో రాగద్వేషాలకు తావులేదని సవినయంగా మనవి చేస్తున్నా.

సందర్భానుసారంగా ఏఏ పార్శ్వాలను స్పృశించినా ఇది స్థూలంగా తెలుగు సినీగేయకవుల చరిత్ర. తెలుగు సినిమాపాట వికాసాన్ని ఇంతకు ముందు పద్యమాల ప్రభావం కోణం నుంచి పరిశీలించిన ఈ రచయిత ఇప్పుడు ఆ వికాసాన్ని మార్గనిర్దేశకులైన సినీ కవుల పరంగా సమీక్షిస్తున్నందు వలన – ఇది పాతపాటకు కొత్తరాగం!

## తెలుగు చలనచిత్రగేయ జాతీయబహుమతి గ్రహీతలు



**శ్రీశ్రీ**
చిత్రం : అల్లూరి సీతారామ రాజు (1974)



**వేటూరి సుందరరామ మూర్తి**
చిత్రం : మాతృదేవోభవ (1993)



**సుద్దాల అశోక్ తేజ**
చిత్రం : ఠాగూర్ (2003)

❖❖❖

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Telugu+Cine+Geya+Kavula+Charitra](http://kinige.com/book/Telugu+Cine+Geya+Kavula+Charitra)**

* * *